ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సెహరీ (ఆదివారం ఉదయం)
కడప	6.30	5.12
ప్రొద్దుటూరు	6.31	5.16

అతివకు వందనం

నేడు మహిళా దినోత్సవం





ఆమె సహనానికి మారుపేరు. సకలచరాచర జీవికి మూలం. సృష్టికి ప్రతిసృష్టి చేసే శక్తిస్వరూపం. అయినా మహిళ అంటే గతంలో వంటింటికే పరిమితం. ఇప్పుడు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లోను వందశాతం రాణిస్తున్నారు. వ్యాపారం ఉద్యోగం రాజకీయం.. ఏ రంగమైనా సరే.. మహిళలు ముందంజలో ఉన్నారు. మన జిల్లానే పరిశీలిస్తే.. జాయింట్ కలెక్టర్ నుంచి కీలకమైన శాఖలన్నిటిలోను మహిళా అధికారులే ఉన్నారు. ఇక రాజకీయాల్లో కూడా రాణిస్తూ తమ మార్కు చాటుకుంటున్నారు. శనివారం మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలువురు మహిళా అధికారుల ప్రస్థానం వారి మాటల్లోనే..

(కడప -ఆంధ్రజ్యోతి)

- కుటుంబ నిర్వహణ నుంచి అన్నింట్లోను ఆమె..
- పురుషులతో దీటుగా.. సమానంగా అవకాశాలు

వైద్య వృత్తి సంతృప్తినిచ్చింది



నేను నెల్లూరులో జన్మించాను. ఎంబీబీఎస్ కర్నూలులో చదివా. నాకు వైద్య వృత్తిపై ఇష్టముండడంతో నాన్న ఆ దిశగా ప్రోత్సహించారు. డాక్టర్ అయ్యాక కుటుంబ సభ్యులు, భర్త ప్రోత్సాహం అందించారు. మా కుటుంబం నుంచి 14 మంది వైద్యవృత్తిలో పనిచేస్తున్నారు. 2022 నుంచి కడప మైక్రోబయాలజీ విభాగంలో హెచ్ఓడీగా నిర్వహిస్తూనే వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్నా. అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్‌గా పదోన్నతి పొందా. వైద్యవృత్తిలో పూర్తిస్థాయిలో సంతృప్తి చెందుతున్నా. మహిళ అనే భావన లేదు. ఒత్తిడి లేదు. గతంతో పోల్చితే అన్ని రంగాల్లో మహిళలు ఉన్నారు. మహిళ చదువుకుంటే సమాజం బాగుంటుంది.

- డాక్టర్ సురేఖ, రిమ్స్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్

అమ్మానాన్నలే స్ఫూర్తి



మాది మధ్యతరగతి కుటుంబం. తల్లిదండ్రులు చిన్న వ్యాపారం చేసుకుంటూ జీవించేవారు. మాది కడపే. ప్రాథమిక విద్య ఇక్కడే చదివాను. చిత్రదుర్గలో బీడీఎస్ అభ్యసించాను. కొంతకాలం కడపలో దంతవైద్యురాలిగా పనిచేశాను. 2018లో చిత్తూరు జిల్లా సాంఘిక సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. డిప్యుటేషన్‌పై ఇక్కడ ఈడీగా చేరాను. కష్టపడి చదివించిన అమ్మానాన్నలే నాకు స్ఫూర్తి. కుటుంబ బాధ్యతలు చూసుకోవడంలో మహిళలు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేస్తున్నారు. పలురకాల వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి మహిళ ఆరోగ్యంపై దృష్టిసారించాలి.

- డాక్టర్ రాజ్యలక్ష్మి, ఎస్సీకార్పొరేషన్ ఈడీ

నాన్నే స్ఫూర్తి



ఏపీపీఎస్సీ ఎగ్జామ్ రాసి 1996లో గోపవరం ఈఓపీఆర్డీగా పోస్టింగ్ పొందా. 1999లో ఎంపీడీవోగా పదోన్నతి వచ్చింది. జిల్లాలోని పలు మండలాల్లో పనిచేశా. 2024 నుంచి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్నా. నాకు మా నాన్నే స్ఫూర్తి. నాన్న వ్యవసాయ శాఖలో జేడీగా పనిచేసేవారు. మా తల్లిదండ్రులకు నలుగురు సంతానం. మా అమ్మ ఎంతో క్రమశిక్షణతో మమ్మల్ని చదివించారు. ఎక్కడ పనిచేసినా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం. జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లు ఎదుర్కోవాలి. ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. నేటి రోజుల్లో సమానత్వం పేరుతో బాలికలు కల్చర్ వదిలేస్తున్నారు. ప్రతి తల్లి మన సంప్రదాయాలను నేర్పించాలి.

- పి.మైథిలి, డిప్యూటీ సీఈవో, జిల్లా పరిషత్

బాలికలు చదువుకోవాలి



వీరపునాయునిపల్లె మండలం గంగిరెడ్డిపల్లె మా స్వగ్రామం. అమ్మానాన్నలు ఉద్యోగులు కావడంతో ఉమ్మడి అనంతపురం జిల్లా హిందూపురంలో చదువు సాగింది. నెల్లూరు జిల్లాలో డిగ్రీ పూర్తిచేశా. ఇన్ఫోసిస్‌లో ఉద్యోగం చేశాను. గ్రూప్-1 పరీక్ష రాసి 2012లో వైద్యఆరోగ్యశాఖలో ఉద్యోగంలో చేరాను. అనంతరం డిప్యుటేషన్‌పై కడప సీఈఓగా వచ్చాను. స్వతహాగా నేను వైద్యఆరోగ్య శాఖలో పనిచేస్తున్నాను. ప్రతి మహిళ స్వతంత్రంగా జీవించేలా చూడాలి. బాలికలు చదువుకోవాలి. నేను గ్రూప్స్‌కు వెళ్తానంటే ఆడపిల్లలకు పెళ్లి చేసి పంపాలి అన్న బంధువుల మాటలు ఇప్పటికీ మరువలేను.

- పి.సాయిగ్రేస్, స్టెప్ సీఈఓ

ప్రణాళికబద్ధంగా పనిచేయాలి



మాది ప్రొద్దుటూరు. సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పెద్దముడియంలో, స్కూల్ అసిస్టెంట్‌గా చాపాడులో, ప్రొద్దుటూరు జూనియర్ కళాశాలలో పనిచేశా. 2007లో గ్రూప్-1కు ఎంపికై డిప్యూటీ రిజిస్ట్రార్‌గా రాజంపేట, నంద్యాలలో పనిచేశా. కొంతకాలం సహకార శాఖలో పనిచేశాను. డిప్యూటీ కమిషనర్‌గా కడప, తిరుపతిలో పనిచేశాను. శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా, కడప ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేశాను. ప్రణాళికబద్ధంగా పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు. 70శాతం మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కుటుంబానికి ప్రాధాన్యత ఇచ్చి బ్యాలెన్స్‌డ్‌గా వెళ్లాలి.

- శ్రీలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



మా సొంతూరు కలసపాడు మండలం ఎగువరామాపురం. కలసపాడులో ప్రాథమిక విద్య, పోరుమామిళ్లలో హైస్కూలు విద్యనభ్యసించాను. తిరుపతి ఎస్వీలో బీవీఎస్ పూర్తిచేశా. చాపాడులో పశువైద్యశాలలో జాయిన్ అయ్యాను. జమ్మలమడుగు ఏడీగా పనిచేశాను. సమస్యలను ధైర్యంగా ఎదుర్కొనేలా నన్ను మా తల్లిదండ్రులు తీర్చిదిద్దారు. మూగజీవాలకు వైద్యం అందించడం చాలా సంతోషాన్ని ఇస్తోంది. వ్యాధి నిరోధక టీకాల విషయంలో అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్తున్నాను. మహిళలు ఉద్యోగం లేదని అధైర్యపడకుండా అవకాశాలను అందిపుచ్చుకుని ముందుకెళ్లాలి.

- డాక్టర్ శారదమ్మ, జేడీ పశుసంవర్ధక శాఖ

క్రమశిక్షణ ఉండాలి



ప్రతి మహిళ విలువలతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలి. పిల్లలను కనీసం డిగ్రీ వరకు చదవించేలా చూడాలి. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో పెంచాలి. మాది ముద్దనూరు మండలం తిమ్మాపురం. పెరిగింది కర్నూలు జిల్లా యెల్లూరు. పది వరకు అక్కడే చదివా. డిగ్రీ, బీఈడీ చదివాను. గ్రేడ్-1 సంక్షేమాధికారిగా, అనంతరం ఎస్‌డబ్ల్యూఓగా పనిచేశా. డీఎస్‌డబ్ల్యూగా కడపకు వచ్చాను. 2013లో ప్రకాశం జిల్లా డీడీగా, 2017లో కడప డీడీగా, 2020లో కృష్ణాజిల్లా డీడీగా, 2023 నుంచి కడపలో పనిచేస్తున్నాను. పేదరికంలో ఉన్న బాలికలు మంచి ప్రతిభ చూపుతున్నారు. వారు ఉన్నతస్థాయిలో జీవించడం సంతోషాన్నిస్తుంది.

- సరస్వతి, డీడీ సోషల్ వెల్ఫేర్

యూనిఫాం వేసుకోవడమే నా కల



చిన్నప్పటి నుంచి పోలీస్ యూనిఫాం వేసుకోవాలి.. పబ్లిక్‌తో మమేకమై పనిచేయాలన్నది నా కల. అది నెరవేరింది. అందుకు నా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. అలహాబాద్‌లో ఐఐటీ చేశా. కొంతకాలం ఐటీ సెక్టార్‌లో పనిచేశా. కానీ పోలీస్‌గా పనిచేయాలన్నదే నా కల. అందుకే గ్రూప్స్ రాశాను. మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా పోస్టింగ్ సాధించాను. నా భర్త కూడా డీఎస్పీనే. ఇద్దరం ఒకే బ్యాచ్. నాకు ఆయన సహకారం ఉంది. మా నాన్న ఇక్కడే పనిచేసేవారు. నా ట్రైనింగ్ కర్నూలులో చేశాను. మహిళలను ప్రోత్సహించేలా పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ వారిలో చైతన్యం తీసుకువస్తున్నాను.

- భావన, డీఎస్పీ, ప్రొద్దుటూరు

మహిళలను గౌరవించాలి



చిన్నప్పటి నుంచి గ్రూప్-1 అధికారి కావాలన్నది నా లక్ష్యం. అందుకు తగ్గట్లుగా చదువుకున్నాను. మాది కర్ణాటకలోని బళ్లారి. తల్లిదండ్రులు సునీత, మోహన్. 1 నుంచి 3 వరకు హైదరాబాద్‌లో, నెల్లూరులో 6వ తరగతి, చిత్తూరులో 7 నుంచి 10 వరకు విద్యాభ్యాసం సాగింది. 2019లో సెంట్రల్ గవర్నమెంట్‌లో పనిచేశాను. గ్రూప్-1 పరీక్ష రాసి బొబ్బిలి ఆర్డీవోగా, ఆ తర్వాత జమ్మలమడుగు ఆర్డీవోగా పనిచేస్తున్నాను. మహిళలను అందరూ గౌరవించాలి. మహిళలు అన్నింట్లోను రాణిస్తున్నారు.

ఆదిమూలపు సాయిశ్రీ, ఆర్డీవో జమ్మలమడుగు

రంగన్న మృతిపై విచారణ వేగవంతం

- సిట్ ఏర్పాటు దిశగా అడుగులు
- వివేకా హత్యకేసులో ఇప్పటికే నలుగురు సాక్షులు మృతి
- ఇవన్నీ అనుమానాస్పద మృతిగా కేసులు నమోదు
- సిట్ ఏర్పాటైతే.. వీరి మరణం వెనక వీడనున్న మిస్టరీ

(కడప-ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఏళ్లు గడుస్తోంది. అయినా ఈ కేసు విచారణ మాత్రం కొలిక్కి రావడం లేదు. మొన్నటి వరకు సీబీఐ సాగించిన దర్యాప్తులో ఏం జరిగిందనేది ప్రజలందరికీ తెలిసిందే. వివేకా కేసులో ఉన్న సాక్షులు ఒక్కొక్కరుగా ఇప్పటికే నలుగురు మృతిచెందారు. వీరందరివీ కూడా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసులు నమోదు చేశారు. అయితే వివేకా కేసులో కీలక సాక్షి రంగన్న మృతితో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈయన మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టనున్నారు. ఈ మేరకు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. సిట్ ఏర్పాటైతే ఇప్పటి వరకూ మృతిచెందిన వివేకా కేసులోని నలుగురి మరణం వెనుక మిస్టరీ వీడే అవకాశం ఉంది.

వైఎస్ వివేకానందరెడ్డి ఆయన ఇంట్లోనే 2019 మార్చి 15వ తేదీ దారుణ హత్యకు గురయ్యారు. ఆ సమయంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. వైసీపీ నాయకులు 'నారాసుర రక్తచరిత్ర' అంటూ ప్రచారాలు సాగించారు. అయితే సీబీఐ విచారణలో వివేకా హత్య వెనుక ఎవరున్నారనే విషయం క్రమంగా ప్రజలకు తేటతెల్లమవుతూ వచ్చింది. సీబీఐ లోతుగా దర్యాప్తు ప్రారంభించడంతో వైసీపీ ప్రభుత్వంలో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తూ వచ్చారు. చివరకు సీబీఐ అధికారులపైనే కేసులు నమోదు చేయించారు.

ఒక్కొక్కరుగా సాక్షులు మృతి..

వివేకా హత్య కేసులో సాక్షులుగా ఉన్న ఒక్కొక్కరు అనుమానాస్పద స్థితిలో మృతిచెందుతూ వస్తున్నారు. అందులో మొదట శ్రీనివాసులరెడ్డి, తర్వాత కువైట్ గంగాధర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, రెండురోజుల క్రితం రంగన్న.. ఇలా నలుగురు మృతిచెందారు. కీలకమైన సాక్షులుగా భావించిన వీరు మృతిచెందడం, అనుమానాస్పద మృతి కేసులుగా నమోదు కావడం వరకే ఆగిపోయింది. ఇప్పుడు రంగన్న మృతితో రాష్ట్ర ప్రభుత్వం ఈ కేసుపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలుస్తోంది.

సీఎం ప్రస్తావనతో..

అనుమానాస్పద స్థితిలో రంగన్న మృతిచెందినట్లు కేసు నమోదు చేశామని ఇప్పటికే ఎస్పీ ప్రకటించారు. నలుగురు సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోవడంతో అనుమానాలు వచ్చాయని అయినా వీటిపై పూర్తిస్థాయి దర్యాప్తు సాగలేదన్నారు. దీనిపై డీఎస్పీ స్థాయి అధికారిని, నిపుణులతో కూడిన బృందాన్ని నియమిస్తామని ఎస్పీ ప్రకటించారు. ఈ బృందం నలుగురు సాక్షుల మృతిపై విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. సాక్షాత్తు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రంగన్న మృతిపట్ల శుక్రవారం మంత్రివర్గ సమావేశంలో చర్చించడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. వివేకా హత్య కేసుకు సంబంధించిన విషయంలో ఏ చిన్న విషయాన్నయినా పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ప్రభుత్వంపై ఆరోపణలు గాని, విమర్శలు గాని రాకుండా ఉండేలా చూడాలని భావిస్తున్నట్టు సమాచారం. ఏదిఏమైనా రంగన్న మృతితో వివేకా కేసు మరోసారి లోతుగా దర్యాప్తు సాగనుందని చెప్పవచ్చు.

భూసేకరణ పూర్తిచేయండి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో భూసేకరణ పనులపై జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారి భూసేకరణ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఆర్డీవోలు, తహశీల్దారులు, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భూ సేకరణ పనుల పూర్తికి బృందాలుగా ఏర్పడి కార్యాచరణ రూపొందించాలన్నారు. పెండింగ్ భూసమస్యలపై ఆర్డీవోలు చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ జాతీయ రహదారి భూ సేకరణ పనుల పురోగతిపై ఆయా పనుల వారీగా అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ, నేషనల్ హైవేస్ అధికారులు, ఆర్డీవోలు చెన్నయ్య, సాయిశ్రీ, చంద్రమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై కలెక్టర్ కొరడా

- తాజాగా మరో ఇద్దరిపై వేటు
- పంచాయతీ సెక్రటరీ పుల్లారెడ్డి సస్పెన్షన్
- కంప్యూటర్ ఆపరేటర్ హనీఫ్ బాష సర్వీస్ నుంచి తొలగింపు

7

ఎస్సీ కార్పొరేషన్ భూములు పరాధీనం

7

మహిళా ఉపాధ్యాయులపై దాడి

- ఉపాధ్యాయుడిపై కేసు నమోదు



ఫిర్యాదు చేస్తున్న మహిళా ఉపాధ్యాయులు

వేంపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): భావిభారత పౌరులను తీర్చిదిద్దే పవిత్రమైన వృత్తిలో ఉన్నవారు.. పదిమందికి మంచీచెడులు చెప్పాల్సిన వారే.. విచక్షణ కోల్పోయి బడిలోనే ఘర్షణ పడ్డారు. సహచర మహిళా ఉపాధ్యాయులపై ఓ ఉపాధ్యాయుడు దాడికి పాల్పడ్డాడు. ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. వేంపల్లె ఎస్ఐ రంగారావు, ఉపాధ్యాయులు, అధికారులు తెలిపిన సమాచారం మేరకు..

వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కొంతకాలంగా ఉపాధ్యాయుల మధ్య ఘర్షణ వాతావరణం ఉంది. 9వ తరగతి విద్యార్థినులకు సైన్స్ పాఠాలు చెప్పే విషయంలో వీరు గతంలో గొడవపడ్డారు. అప్పట్లో డీఈవో విచారణ జరిపారు కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం హైస్కూల్లోకి ఉపాధ్యాయురాలు నాగాంజలి నడుచుకుంటూ వెళ్తుండగా ఉపాధ్యాయుడు గురునాథ్‌రెడ్డి తన కారును ఆమె పక్కన వేగంగా పోనిచ్చాడు. ఈ విషయమై మహిళా ఉపాధ్యాయులు నాగాంజలి, సునీత, భవానిలకు సైన్స్ ఉపాధ్యాయుడు గురునాథ్‌రెడ్డికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సమయంలో మహిళా ఉపాధ్యాయులపై అతను దాడిచేశాడు. దీంతో వేదనకు గురైన మహిళా ఉపాధ్యాయులు వేంపల్లె ఎస్ఐ రంగారావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన గురునాథ్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్.. హెచ్ఎంపైనా వేటు

వేంపల్లె బాలికల హైస్కూల్లో మహిళా ఉపాధ్యాయులపై దాడిని జిల్లా విద్యాశాఖ అధికారులు తీవ్రంగా పరిగణించారు. దాడి చేసిన సైన్స్ ఉపాధ్యాయుడు గురునాథ్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఈవో షంషుద్దీన్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఉపాధ్యాయులను అదుపులో పెట్టుకోలేకపోవడం, ఘర్షణను నివారించే ప్రయత్నం చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులకు చెప్పని కారణంగా హెచ్ఎం నారాయణమ్మపై ఆర్జేడీ సస్పెన్షన్ వేటు వేశారు.

ఫ్రై డే







ఎండ కారణంగా నిర్మానుష్యంగా మారిన కడప సెవెన్ రోడ్స్ సర్కిల్



కడప కలెక్టరేట్ మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. వాతావరణ శాఖ కూడా ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు గతేడాది కంటే అధికంగా ఉండొచ్చని ఇప్పటికే హెచ్చరికలు చేసింది. శుక్రవారం సూర్యుడు భగభగమన్నాడు. జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో ఎండతో జనం అల్లాడిపోయారు. వేంపల్లి మండలంలో అత్యధికంగా 40.1సెంటీ గ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చాపాడులో 39.9 డిగ్రీలు, కడపలో 39.3 డిగ్రీలు, పెండ్లిమర్రిలో 39.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో 34 డిగ్రీల నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శని, ఆదివారాల్లో కూడా ఇంచుమించు ఇదేవిధంగా జిల్లాలో ఎండలు నమోదు కానున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు గతం కంటే ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.



- వరండాలోనే విలువైన మందులు, స్టేషనరీ నిల్వ
- చాలీచాలని గదుల్లో విధుల నిర్వహణ
- ఉద్యోగులు కూర్చునేందుకు కుర్చీల కొరత
- ఇదీ.. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం తీరు

ఆరోగ్య శాఖ కార్యాలయానికి బాలారిష్టాలు..

హడావుడిగా జిల్లాలు విభజించిన ప్రభుత్వం ఏళ్లు గడుస్తున్నా జిల్లాకు అవసరమైన అన్ని వనరులూ కల్పించడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనడానికి రాయచోటిలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం అద్దం పడుతోంది. ఏళ్లు గడుస్తున్నా కనీస వసతులు కల్పించకపోవడంతో అందులో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రాయచోటి(కలెక్టరేట్), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ఏర్పాటు దాదాపు మూడేళ్ల కావస్తున్నా ఇప్పటి వరకు వైద్య ఆరోగ్యశాఖలో కూర్చోవడానికి కుర్చీలు, మందులు నిలువ చేసుకునే వసతి లేక సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఏర్పాటు సమయంలో సాయి ఇంజనీరింగ్ కాలేజీలో దాదాపు పది గదులు అద్దెకు తీసుకొని ఏడాది పాటు కాలం నెట్టుకొచ్చారు. వాటికి నెలకు దాదాపు రూ.1.20 లక్షలు అద్దె చెల్లించలేక 2023లో కడప-చిత్తూరు జాతీయ రహదారిలో ఉన్న ఎస్టీ బాయ్స్ హాస్టల్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అయితే అక్కడ తగినన్ని గదులు



వరండాలో నిల్వ చేసిన మందులు స్టేషనరీ

లేకపోవడం ఒకే గదిలో 10 సెక్షన్ల ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. ఇక మందులు, మెటీరియల్ భద్ర పరి చేందుకు వరండా తప్ప మరెక్కడా స్థలం లేదని చెబుతున్నారు. దీంతో మందులతోపాటు, రికార్డులు తదితర స్టేషనరీ అంతా వరండాలోనే నిలువ చేశారు. కొత్త జిల్లాలు ఏర్పాటు చేశారు. కానీ కొన్ని కార్యాలయాలకు కనీసం వసతులు కూడా లేని పరిస్థితులు ఈ జిల్లాలో నెలకొని ఉండడం చాలా బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండు గదులైనా నిర్మించి ఇస్తే కొంత బాగుంటుందని ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది చెబుతున్నారు. ఇక ఈ కార్యాలయంలో తాగటానికి నీరు, బాత్‌రూమ్‌లు, ఇంటర్నెట్ సౌకర్యం కూడా సరిగ్గా లేదని తెలిసింది.

సిబ్బందికి ఇబ్బందిగానే ఉంది..

కొత్త జిల్లాల్లో కనీస వసతుల కొరత ఉంది. విజయవాడ నుంచి మందులు, మెటీరియల్ వస్తే నిలువ చేయడానికి ప్రత్యేకంగా గది లేదు. కాబట్టి వరండాలో వాటిని నిలువ చేస్తున్నారు. గదులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం అన్న మాట వాస్తవమే. ఈ విషయం ఇదివరకే మేము పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-కొండయ్య, జిల్లా వైద్యాధికారి

టమోటా ధరల పతనంపై విచారణ

- ములకలచెరువులో మార్కెటింగ్ శాఖ అధికారి ఆరా..

ములకలచెరువు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు ఇంత దారుణంగా పడిపోవడానికి కారణమేమిటంటూ గుంటూరు డైరెక్టరేట్ ఆఫ్ మార్కెటింగ్, ఇన్‌స్పెక్షన్ అధికారి కిరణ్ ఆరా తీశారు. ములకలచెరువు మార్కెట్ యార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. ధరల పతనానికి గల కారణాలపై రైతులను విచారించారు. అనంతరం మార్కెట్ కమిటీ అధికారులు, మండీ యజమానులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఇక్కడి నుంచి టమోటాలు ఎగుమతి అవుతున్న కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో దిగుబడి అధికంగా ఉండడంతో టమోటాలు కొనుగోలుకు బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు రాకపోవడం ఒక కారణమని గుర్తించారు. ఫలితంగా ధరలు పతనమయ్యాయని మండీ యజమానులు వివరించారు. మదనపల్లె, కలికిరి, గుర్రంకొండ, పుంగనూరు టమోటా మార్కెట్లను కూడా ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ సూపర్‌వైజర్ బాలాజీ, సిబ్బంది రాజు, రహీం, సునీల్‌లు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న గుంటూరు మార్కెటింగ్ శాఖ అధికారి కిరణ్

ప్రభుత్వ న్యాయవాదుల నియామకం

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాకు సంబంధించి రెండు వేర్వేరు కోర్టుల్లో ఇద్దరు న్యాయవాదులను ప్రభుత్వం నియమించింది. రాయలసీమ జిల్లాలకు సంబంధించి దేవదాయ శాఖ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ నియామకం కూడా చేసింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. కడపకు చెందిన న్యాయవాది బి.శ్రీనివాసులును స్థానిక అదనపు సహాయ సెషన్స్ జడ్జి కోర్టులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 52 సెషన్స్ కోర్టు కేసులు పరిష్కారమయ్యేంత వరకు, లేదా తొలగించేంత వరకు , లేదా మూడేళ్ల పదవీ కాలం పూర్తయ్యే వరకు ఏది ముందయితే అంత వరకూ ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ కాలంలో నెలకు రూ.25 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఇక కడప పోక్సో కేసుల స్పెషల్ కోర్టులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కడపకు చెందిన మరో న్యాయవాది కొమ్మినేని వేణుగోపాల్‌ను నియమించారు. మూడేళ్ళ కాల వ్యవధి ముగిసేంత వరకుగానీ లేదా తొలగించే వరకుగానీ ఏది ముందయితే అంత వరకూ ఆయన ఎస్‌పీపీగా కొనసాగనున్నారు. నెలకు రూ.40 గౌరవ వేతనం చెల్లించనున్నారు. కాగా రాయలసీమ జిల్లాలయిన తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి, అనంతపురం, నంద్యాల జిల్లాలకు సంబంధించి దేవాదాయ శాఖ కేసులను హైకోర్టులో పర్యవేక్షించడానికి స్టాండింగ్ కౌన్సిల్‌గా న్యాయవాది తూము వేణుగోపాల్‌ను నియమించారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్ ప్రతిపాదనతో ఈయనను కూడా మూడేళ్ళ కాల వ్యవధితో నియమించారు. నెలకు రూ.50 వేలు గౌరవ వేతనం చెల్లించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర నాయ, శాసన వ్యవహారాల కార్యదర్శి గొట్టపు ప్రతిభాదేవి శుక్రవారం మూడు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు.

సెలవు రోజునా.. ఆస్తుల రిజిస్ట్రేషన్లు

మదనపల్లె, మార్చి7(ఆంధ్రజ్యోతి): సెలవు రోజులైన శని, ఆదివారం కూడా తమ కార్యాలయం పనిచేస్తుందని స్థానిక సబ్‌రిజిస్ట్రార్ గురుస్వామి తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రార్, డీఐజీ, ఐజీ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మదనపల్లె సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం రెండో శనివారం, ఆదివారం కూడా పనిచేస్తుందని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సౌమ్యనాథాలయ హుండీ కానుకల లెక్కింపు

నందలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సౌమ్యనాథ స్వామి ఆలయ హుండీలో 24 రోజులకుగాను భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. దీంతో 1,94,302 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టీటీడీ విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

పీలేరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం రేగళ్ల గ్రామ పంచాయతీ నగరి సమీపంలో డి.కృష్ణయ్య(60) అనే వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పొలంలో కృష్ణయ్య మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పీలేరు ఎస్ఐ బాలకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ..

సిద్దవటం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మెకానిక్ షాపు వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని మండల కేంద్రంలోని సిద్దవటం బ్రాహ్మణవీధి నివాసి ఉన్న జి.వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం ఉదయం బాకరాపేట గ్రామంలోని అమీర్ మెకానిక్ షాపులో ద్విచక్ర వాహనం పెట్టి నందిమండలం ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో విధులకు వెళ్లానని, సాయంత్రం ఐదు గంటలకు వచ్చే సరికి ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఏఎస్ఐ సుబ్బరామచంద్ర మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి బైక్ ఆచూకీ గుర్తిస్తామని తెలియజేశారు.

కొండకు నిప్పు.. మామిడితోటలు దగ్ధం

నిమ్మనపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓబులేసుని కొండకు శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సమీపంలోని 15 ఎకరాల్లో వివిధ పైరకు తీవ్ర నష్టం వాటిల్లింది. రైతు నరేంద్ర తోటలోని 45 అల్లనేరేడు చెట్లు, మామిడి చెట్లు కాలిపో, రమణకు చెందిన కంచె, నిమ్మనపల్లి రైతు సిలార్‌కు చెందిన మామిడి తోట కాలిపోయినట్లు తెలిపారు.



మంటలు ఆర్పుతున్న రైతు

సుండుపల్లెలో..

సుండుపల్లె: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో 7 ఎకరాల విస్తీర్ణంలోని తమ మామిడి తోట దగ్ధమైందని రైతులు నారాయణరెడ్డి, జనార్దన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో 80కిపైగా పూత దశలో ఉన్న మామిడి చెట్లు కాలిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలిపోయిన మామిడి తోటను మాచిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన ఎంపీహెచ్ఈవో రెడ్డినాయక్ శుక్రవారం పరిశీలించారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి ఓ యువకుడు గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు బి.కొత్తకోట మండలం, బీరంగి గ్రామానికి చెందిన రవి కుమారుడు శ్రీకాంత్ (24) అదే గ్రామంలో శంకరాపురం వద్ద చెట్టు ఎక్కి ఆకులు కోస్తున్న సమయంలో కరెంటు తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు, గమనించిన కులుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బి.కొత్తకోట పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న యువకుడు

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కురబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన అశోక్ భార్య బార్గవి (20) శుక్రవారం ఉదయం తన భర్త ,మామలు తరచూ గొడవ పడుతుండడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న మహిళ

వేడి నీళ్లలో పడి చిన్నారికి గాయాలు

మదనపల్లె అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేడి నీళ్లలో పడడంతో ఓ చిన్నారి గాయాలపాలైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు కురబలకోట మండలం, అంగళ్లు పంచాయతీ సర్కార్ తోపునకు చెందిన అక్ష అంజుమ్ (3) శుక్రవారం ఉదయం ఆడుకుంటూ వేడినీళ్లలో పడడంతో శరీరం కాలిపోయింది. తల్లిదండ్రులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చిన్నారి కోలుకుంటోంది.

విధి నిర్వహణలో అలసత్వానికి ఇద్దరు డాక్టర్లపై చర్యలు

- ఒకరి సస్పెన్షన్.. మరొకరికి షోకాజ్ నోటీసులు

పెనగలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లలో రమ్మీ నిమ్మచి సస్పెన్షన్ కాగా మరో డాక్టర్ థౌషిప్‌కు జిల్లా కలెక్టర్ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు డాక్టర్ రమ్మీ నిమ్మచి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, పలు మార్లు ప్రజల నుంచి అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మరో డాక్టర్ థౌషిప్ కూడా విధులకు ఆలస్యంగా రావడంతోపాటు, అప్పుడప్పుడు గైర్హాజరవుతున్నట్లు కూడా తెలియజేయడంతో ఆయనకు కూడా షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఇదిలా ఉండగా ఇరువురు డాక్టర్లు పెనగలూరు పీహెచ్‌సీలో తొలిసారిగా ఉద్యోగంలో చేరారు. ఇటీవలనే రెగ్యులర్ అయినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పెనగలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటివరకు పనిచేసిన డాక్టర్లలో ఒకరు సస్పెన్షన్ కావడం, మరొకరికి షోకాజ్ నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. ఈ విషయం వాస్తవమేనని సీహెచ్‌వో సురేంద్రనాథరాజు వివరించారు.

అవినీతి ఆరోపణల నుంచి ఇన్‌స్పెక్టర్ రవిబాబుకు ఊరట

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గతంలో లక్కిరెడ్డిపల్లె పోలీసు ఇన్‌స్పెక్టరుగా పనిచేసి ప్రస్తుతం అనంతపురం ఇంటిలిజెన్స్‌లో వున్న పి.రవిబాబుకు ప్రభుత్వం నుంచి ఊరట లభించింది. గతంలో ఆయనపై పడిన నిందను తొలగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. లక్కిరెడ్డిపల్లె సీఐగా పనిచేసే కాలంలో రామాపురం పోలీసు స్టేషన్‌లో 2018లో నమోదైన ఒక కేసునుంచి నిందితుడిని తప్పించడానికి మధ్యవర్తితో రూ.27 వేలకు ఒప్పందం కుదుర్చు కున్నాడని, ఆయన సూచన మేరకు ఆ మొత్తాన్ని రామాపురం హెడ్ కానిస్టేబుల్ తీసుకున్నాడని ఆరోపణ. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికెళ్లడంతో విచారణ చేసి రవిబాబును నిందితుడిగా నిర్ధారించారు. ఈ విషయంపై ఆయన అడిషనల్ డైరెక్టర్ జనరల్‌కు అప్పీలు చేసుకోగా 2021 మార్చి 3న తిరస్కరించారు. తాజాగా ప్రభుత్వం ముందు రివిజన్ పిటిషన్ దాఖలు చేయడంతో డీజీపీ.. రవిబాబుకు అనుకూలంగా ప్రభుత్వానికి నివేదించారు. పూర్వాపరాలను పరిశీలించిన ప్రభుత్వం ఎట్టకేలకు ఆయనపై మోపిన 'నింద'ను తొలగించింది.

ఈ మేరకు రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

బ్రెడ్డు తిని ఐదుగురు విద్యార్థులకు అస్వస్థత

తంబళ్లపల్లె,మార్చి 7(ఆంధ్రజ్యోతి): బ్రెడ్డు తినడంతో ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కోటకొండ ఎంపీపీ పాఠశాల ఆరో తరగతి విద్యార్థులు అరవింద్, బన్నీ, అశ్వనీ, సంధ్య, జగదీష్ శుక్రవారం పాఠశాల విశ్రాంత సమయంలో పాఠశాలకు సమీప దుకాణంలో బ్రెడ్డు తెచ్చుకుని తిన్నారు. కొద్ది సేపటికి వాంతులై అస్వస్థతకు గురయ్యారు. గమనించిన ఉపాధ్యాయురాలు లలిత పక్కనే ఆరోగ్య ఉపకేంద్రంలో ఉన్న ఎంఎల్‌హెచ్‌పి దేవిక, ఏఎన్ఎం గంగులమ్మకు చెప్పడంతో వెంటనే వైద్య సిబ్బంది పాఠశాలకు వెళ్లి చికిత్స చేశారు. కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ, మునికుమార్ హుటాహుటిన పాఠశాల చేరుకుని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సమాచారం అందుకున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య, ఎంఈఓ త్యాగరాజు, నాగసుబ్బరాయుడు పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి విద్యార్థులంతా పూర్తి ఆరోగ్యంగా ఉన్నట్లు మెడికల్ ఆఫీసర్, ఎంఈఓలు తెలిపారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య, ఎంఈఓ

డ్వాక్రా గ్రూప్ లీడర్ రూ. 12 లక్షల దుర్వినియోగం

మదనపల్లె అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా గ్రూపునకు చెందిన నగదును గ్రూపు లీడర్ స్వాహా చేసిందంటూ ఆ గ్రూపు సభ్యు లు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీకి చెందిన రాజరాజేశ్వరి గ్రూప్‌లో 10 మంది సభ్యులు ఉండ గా లీడర్‌గా కె. రాధా వ్యవరించేది. గ్రూపు సభ్యులు పొదుపు చేసుకున్న నగదు, మరో గ్రూప్ సభ్యురాలు లక్ష్మీదేవికి చెందిన రూ. 1.2 లక్షలతో సహా రూ. 12 లక్షలతో ఉడాయించింది. దీనికి సంఘమిత్ర వాణి పూర్తి సహకారం అందించిందంటూ ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి కేసు నమోదు చేస్తామని తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గ్రూప్ సభ్యులు పద్మ, రెడ్డిరాణి, ని ర్మల, చంద్రకళ, లలిత, లక్ష్మీదేవి ఎ పాల్గొన్నారు.



గ్రూప్ లీడర్‌పై ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

క్యూఆర్ కోడ్ స్కాన్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు

- ప్రత్యేక యాప్ రూపకల్పన
- వినియోగదారులకు వెసులుబాటు

కురబలకోట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలనే ఆశయంతో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. సాధారణంగా విద్యుత్ బిల్లులను చెల్లించడానికి వినియోగదారులు చాలా శ్రమించాల్సి ఉంటుంది. గ్రామీణ, పట్టణ,నగర ప్రాంతాల్లో బిల్లుల చెల్లింపు కేంద్రాల వద్ద వినియోగదారులు రద్దీ ఎక్కువగా ఉండడంతో గంటల కొద్దీ క్యూలైన్ లో నిలబడాల్సివచ్చేది.. నిలుచునే ఓపిక లేకపోవడం, ఇతర పనులు ఉండడం, తదితర కారణాలతో మరోసారి చెల్లించవచ్చని అధికశాతం మంది వెళ్ళిపోతుంటారు. తర్వాత ఆ విషయాన్ని మర్చిపోవడంతో సకాలంలో(14రోజుల లోపు) విద్యుత్ బిల్లులు చెల్లించలేకపోతున్నారు. దీంతో అదనంగా జరిమానాలు భరించాల్సి వచ్చేది. ఈ జరిమానాలు కేటగిరి-2 కు రూ. 150, కేటగిరి-1కు వినియోగదారుడికి వచ్చే బిల్లును బట్టి రూ.25 నుంచి రూ.50 వరకు చెల్లించాల్సి వచ్చేది. ప్రస్తుత పద్ధతిలో చేతిలో సొమ్మున్నా సమయానికి బిల్లులు చెల్లించ లేని వినియోగదారులకు విముక్తి లభించింది. గతంలో ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా విద్యుత్ బిల్లులను చెల్లించే వెసులుబాటు ఉండేది. అయితే వాటిలో పలురకాల సమస్యలు తలెత్తడంతో ఆ పద్ధతికి ప్రభుత్వం స్వస్తి పలికింది. తాజాగా క్యూఆర్ కోడ్ స్కాన్ పద్ధతిని అందుబాటులోకి తీసుకొచ్చింది. దీని ద్వారా సులభంగా ఎక్కడి నుంచైనా బిల్లులను చెల్లించవచ్చును. అయితే విద్యుత్ బకాయిలు ఉన్న వారికి ఇది పని చేయదు. దీంతో వాళ్ళు కార్యాలయానికి వెళ్ళి బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది.



క్యూఆర్ కోడ్‌తో వచ్చిన విద్యుత్ బిల్లు

50శాతం రాయితీతో అదనపు లోడు

వినియోగదారుల సౌకర్యార్థం 50 శాతం రాయితీతో అదనపులోడు పొందే అవకాశాన్ని విద్యుత్ సంస్థ కల్పించింది. సాధారణంగా గృహవినియోగానికి మినిమం వాటేజీకి ఇంటి యజమాని సొమ్ము చెల్లించి ఉంటాడు. ఈ వాటేజీతో ఏసీ, కూలర్, ఫ్రిడ్జ్, హీటర్, గీజర్‌లను వినియోగించడం కదరదు. ఒక వేళ వినియోగిస్తే పరికరాలు కాలిపోయే ప్రమాదం ఉంది. దీంతో వినియోగదారుడికి తీవ్ర నష్టం కలుగుతుంది. అదనపు వాట్స్ పొందితే ఆ సమస్యలను నివారించవచ్చును. ఇందుకోసం గతంలో చెల్లించాల్సిన మొత్తంలో సగం రాయితీ ఇస్తోంది. ఈ మొత్తంతో పాటు అప్లికేషన్ ఫీజు రూ.50, డిపాజిట్ రూ.200చెల్లించాల్సి ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ శంకర్ రెడ్డి తెలిపారు

మెగా డీఎస్సీకి ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ

- జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సురేశ్

రాయచోటిటౌన్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి సురేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సురేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న బీసీ, ఈబీసీ కేటగిరీలకు చెందిన టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ కు సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు రాయచోటిలోని బీసీ సంక్షేమ శాఖ కార్యాలయం లో దరఖాస్తులు పొంది అక్కడే సమర్పించాలన్నారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ప్రారంభ తేదీ తదితర వివరాలు త్వరలో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అధికారులు తెలియజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు రాజంపేట రోడ్డులోని గిరిజన పాఠశాల వెనుక ఉన్న బీసీ సంక్షేమశాఖ కార్యాలయం లో సంప్రదించాలని తెలిపారు.

నందలూరులో ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్

నందలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నందలూరు రైల్వే స్టేషన్‌లో హరిప్రియ, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌ను పునరుద్ధరించారు. కొల్హాపూర్ నుంచి తిరుపతికి వెళ్లే 17416, తిరుపతి నుంచి కొల్హాపూర్‌కు వెళ్లే 17415 హరిప్రియ ఎక్స్‌ప్రెస్, కడప నుంచి విశాఖపట్టణం వెళ్లే 18521, విశాఖపట్టణం నుంచి కడపకు వచ్చే 18522 తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నందలూరులో స్టాపింగ్ రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 8 నుంచి ఆ రైళ్లను నందలూరులో నిలిపేందుకు రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మండలంలోని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పంట పొలాలకు నెమళ్ల బెడద



పొలాల్లోకి గుంపులు గుంపులుగా వస్తున్న నెమళ్లు

చిన్నమండెం, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లి గ్రామ పంచాయతీలో రైతులకు నెమళ్ల బెడద ఎక్కువైందని రైతులు వాపోతున్నారు. పదుల సంఖ్యలో నెమళ్లు గుంపులుగా పొలాలపై పడి వేరుశనగ, వరి, అలసంద వంటి పైర్లను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రయితే అడవి పందులు, పగలైతే నెమళ్లతో రాత్రింబవళ్లు రైతులు పంటల దగ్గర కావలి ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు

ఇద్దరిపై లైంగిక దాడి కేసు నమోదు

నిమ్మనపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లంవారిపల్లెకు చెందిన ఇద్దరిపై రేప్ కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలానికి చెందిన ఓ మహిళ గత నెల 27న సాయంత్రం నల్లంవారిపల్లికి వచ్చి పాలు పోసి వెళుతుంగా అదే గ్రామానికి చెందిన సురేంద్ర, పల్లపు నాగేంద్ర ఆమెను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. భర్త సాయంతో ఆమె తనకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారిపై లైంగికదాడి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఘర్షణలో నలుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

మదనపల్లె అర్బన్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): స్థలం, డబ్బు విషయమై ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో నలుగురు గాయపడ్డారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన సమాచారం మేరకు స్థానిక శేషమహల్ ప్రాంతానికి చెందిన వెంకటరమణ అనే వ్యక్తి స్థలం విక్రయిస్తానంటూ జాషువా నుంచి మూడు లక్షల రూపాయలు తీసుకున్నాడు. ఏడాది గడిచినా స్థలం ఇవ్వకపోగా, డబ్బు కూడా వాపసు చేయలేదు. దీంతో గురువారం రాత్రి జాషువా తన కుమారులతో కలిసి వెళ్లి వెంకటరమణను ప్రశ్నించాడు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఈ ఘర్షణలో జాషువా, అతని కొడుకులు భరత్, జోసెఫ్, మహేష్ గాయపడ్డారు.కుటుంబ సభ్యులు వారిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భూములు పరాధీనం

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఆక్రమణదారులకు సిబ్బంది సహకారం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం వివిధ పథకాలను ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తోంది. ఇందులో స్వయం ఉపాధి కల్పన కోసం రుణాలు ఇవ్వడంతో పాటు భూమిలేని నిరుపేద ఎస్సీ మహిళలకు భూమి కొనుగోలు పథకం కింద వ్యవసాయ భూములను పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా వ్యాపార రంగంలో కూడా ఎస్సీలను ఆర్థికంగా నిలబెట్టేందుకు పలుచోట్ల షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించారు. వీటిలో ఒక్క వేంపల్లెలో మినహాయిస్తే ఉమ్మడి కడప జిల్లా లోని వివిధ ప్రాంతాల్లో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లు దెబ్బతిన్నాయి. వాటిని పునర్నిర్మించే పనులు చేపట్టకపోవడంతో కొన్నిచోట్ల నేలమట్టం అయినట్లు ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు చెబుతున్నారు. వీటిని పరిరక్షించేందుకు అధికారులు తగిన చొరవ చూపకపోవడంతో అన్యాక్రాంతమవుతున్నాయి. ఎస్సీలలో ఆర్థిక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కొన్ని దశాబ్దాల క్రితం వ్యాపార సముదాయాల నిర్మాణాలు చేపట్టి వాటి ద్వారా ఎస్సీ యువతకు ఉపాధి కల్పించడం జరిగేది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా తగిన రీతిలో నిధుల కేటాయింపు లేకపోవడంతో జిల్లాలో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

వందలకోట్ల ఆస్తి పరాధీనం

ఎస్సీ సామాజిక వర్గాల్లోని వారికి కోళ్లపెంపకం ద్వారా ఆదాయ వనరులను సమకూర్చుకునేందుకు ఉమ్మడి కడప జిల్లాలో 81.80 ఎకరాల్లో 155 పౌల్ట్రీ కాంప్లెక్స్‌లను 1984-85 ఆర్థిక సంవత్సరంలో నిర్మించారు. ఇవన్నీ కూడా కూలిపోయినట్లు ఎస్సీ కార్పొరేషన్ అధికారయంత్రాంగం చెబుతోంది. దీంతో ఎస్సీ కార్పొరేషన్‌కి సంబంధించిన పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల స్థలాలను ఎస్సీలే కాకుండా ఇతర సామాజిక వర్గాల వారు కూడా ఆక్రమించుకొని అనుభవించుకుంటున్నారు. దెబ్బతిన్న పౌల్ట్రీ కాంప్లెక్స్‌ల స్థానంలో కొంతమంది రెవెన్యూ వారి ద్వారా రికార్డులు కూడా తమ పేర్లతో పొందినట్లు తెలుస్తోంది.

- రాజంపేట మండలం తాళ్లపాక వద్ద 1984-85 ఆర్థిక సంవత్సరంలో సర్వేనెంబర్ 1162లో 6.72 ఎకరాల్లో 30 షాపుల కెపాసిటీతో ఎస్సీ కార్పొరేషన్ పౌల్ట్రీ కాంప్లెక్స్‌ను నిర్మించింది. ప్రస్తుతం ఆ కాంప్లెక్స్ కుప్పకూలిపోయింది. దీంతో ఇతరులు (ఎస్సీలు కానివారు) తమ పేర్లతో రెవెన్యూ రికార్డుల్లో ఎక్కించుకున్నట్లు సమాచారం. ఈ స్థలం కడప-తిరుపతి ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో మంచి ధర పలుకుతోంది. ఇక్కడ సెంటు భూమి రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఉంటుందని అంచనా. ఈ లెక్కన దాదాపు రూ.80కోట్లు విలువైన స్థలం పరులపాలైనట్లు చర్చ సాగుతోంది.
- పులివెందుల పట్టణంలో 1984-85లో సర్వే నెంబర్ 60-2, 61-2, 62-1లో 12.6 ఎకరాల విస్తీర్ణంలో 22పౌల్ట్రీకాంప్లెక్స్‌లకు నిర్మాణం చేపట్టారు. అది కూడా కూలిపోవడంతో స్థానికంగా ఉన్న ఓ నేత తమ స్థలంలో కలిపేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు సర్వే నిర్వహించి ఆ స్థలం ఎస్సీ కార్పొరేషన్‌కి వస్తుందంటే.. తాను వదిలేందుకు సిద్ధంగా ఉన్నానని ఆ నేత కుటుంబీకులు చెప్పినప్పటికీ సమగ్రంగా సర్వే నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా లేరని సమాచారం.
- చిట్వేలి మండలంలోని గొల్లపల్లెలో సర్వే నెంబర్ 1387-4లో 11.9 ఎకరాల్లో 24, వెంకట్‌రాజుపల్లె సర్వేనెంబర్ 848-బి1, బి-2లలో 9.41ఎకరాల స్థలంలో 19, మల్లంపల్లెలో 146-2లో 9.64ఎకరాలలో 20, లక్కిరెడ్డిపల్లె మండలంలోని బూడిగుంటపల్లెలో సర్వేనెంబర్ 135-3లో 13.52ఎకరాలలో 34, టి.సుండుపల్లె మండలంలోని జీకె రాచపల్లెలో 9, 51, 968లలో 10.29ఎకరాలలో 20, కొండాపురంలో 7.92 ఎకరాలలో 16 పౌల్ట్రీ కాంప్లెక్స్‌లు నిర్మించారు. అయితే అవన్నీ కూలిపోయినట్లు అధికార యంత్రాంగం చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో దాదాపు వీటిల్లో అధిక భాగం ఆక్రమణలకు గురైనట్లు సమాచారం. వేంపల్లెలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ మాత్రం లబ్ధిదారులు వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా...

రాష్ట్రంలోని ఏ జిల్లాలో లేని విధంగా.. ఒక్క కడప జిల్లాలో మాత్రమే జిల్లా హరిజన డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు భూమి ఉండేది. 1974లో ఎస్సీ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ఆ భూమిపై హక్కులు పొందినట్లు సమాచారం. ఈమేరకు ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించిన 3505 ఎకరాల భూమిని కొన్ని దశాబ్దాల క్రితం 1916 మందికి పంపిణీ చేశారు. అయితే ఏక్‌సాల్ పర్మిషన్ మాత్రమే ఇవ్వడం వల్ల ఆ భూములు ఎస్సీ కార్పొరేషన్ పరిధిలోనే ఉన్నాయి. క్షేత్రస్థాయిలో మాత్రం ఎస్సీలు కాకుండా ఇతర సామాజిక వర్గాల వారు ఈ భూములను అనుభవిస్తున్న పరిస్థితి. దురాక్రమణలో ఉన్న ఈ



చిట్వేలి మండలం గొల్లపల్లె వద్ద శిథిలావస్థకు చేరుకున్న పౌల్ట్రీ కాంప్లెక్స్

భూములను తిరిగి ఎస్సీ కార్పొరేషన్ స్వాధీనం చేసుకొని అర్హులైన దళితులకు పంపిణీ చేయాలని అధికారులకు వినతులు అందాయి.

ఆక్రమణదారులకు సిబ్బంది సహకారం

ఎస్సీ కార్పొరేషన్‌లో గతంలో పనిచేసిన కొంతమంది సిబ్బంది ఆ కార్పొరేషన్‌కు సంబంధించిన విలువైన స్థలాల సమాచారాన్ని అందజేసి సొమ్ము చేసుకున్నట్లు చర్చ సాగుతోంది. అంతేకాకుండా చాలా వరకు రికార్డులు కూడా అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటే ఆలోచన చేయాల్సిన పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో దృష్టి సారిస్తే రికార్డులను తిరిగి పొందే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయమై ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

అవినీతి అధికారులపై కలెక్టర్ కొరడా

- తాజాగా మరో ఇద్దరిపై వేటు
- పంచాయతీ సెక్రటరీ పుల్లారెడ్డి సస్పెన్షన్
- కంప్యూటర్ అపరేటర్ హనీఫ్ బాష సర్వీస్ నుంచి తొలగింపు

కడప రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా అర్థిక అక్రమాలకు పాల్పడ్డ అవినీతి అధికారులపై జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కొరడా ఝుళిపిస్తున్నారు. ఇప్పటికే వేంపల్లె, ఒంటిమిట్ట, తొండూరు మండలాల్లో గ్రామ పంచాయతీ, మండల పరిషత్ నిధుల దుర్వినియోగానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా బాధ్యులైన ఎంపీడీవో, ఏవో, ఈవోపీఆర్‌డీ, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ సెక్రటరీలతో సహా 7 మందికి పైగా సస్పెండ్ చేశారు. తాజాగా రాజుపాళెం మండలం ఏరువపాలెం గ్రామ పంచాయతీ గ్రేడ్- 3 సెక్రటరీ(ప్రస్తుతం డీపీఆర్‌సీ రిసోర్స్ పర్సన్) బి.పుల్లారెడ్డిని సెస్పెండ్ చేశారు. అలాగే చాపాడు మండలం కంప్యూటర్ ఆపరేటర్ షేక్ హనీఫ్ బాషను విధుల నుంచి తొలగించారు. పుల్లారెడ్డి వైసీపీ ప్రభుత్వంలో ఏరువపాలెం గ్రామ పంచాయతీ సెక్రటరీగా ఉన్న సమయంలో గ్రామ పంచాయతీ నిధులలోని రూ.4,25,986ల ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. దీంతో సదరు నివేదికను ఈ-ఆఫీస్ ద్వారా కలెక్టర్‌కు పంపగా... సీసీఏ రూల్స్ 1991లోని రూల్ 8 కింద సర్వీస్ నుంచి సస్పెండ్ చేశారు. అలాగే చాపాడు మండలంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న షేక్ హనీఫ్ బాష బద్రిపల్లి గ్రామ పంచాయతీ నిధులలో రూ.2,56,325లు మేర ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారు. దీంతో కలెక్టర్ అతన్ని సర్వీస్ నుంచి తొలగించి క్రిమినల్ చర్యలకు ఆదేశించారు.

కడప ఓరియంటల్ హైస్కూల్ పెండింగ్ బిల్లులకు నిధులు విడుదల

కలికిరి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కడప పట్టణంలోని చౌడేశ్వరీదేవి ఓరియంటల్ హైస్కూల్ అభివృద్ధి పనులకు పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం రూ.20.33 లక్షలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పనులు జరిగినా వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో హై కోర్టులో 2023లో రిట్ పిటిషన్ దాఖలైంది. తరువాత బిల్లులు చెల్లించాలన్న కోర్టు ఉత్తర్వులు అమలుకాకపోవడంతో కోర్టు ధిక్కార కేసు నమోదైంది. మొత్తం వ్యవహారాన్ని పరిశీలించిన ఆర్థిక శాఖ పెండింగ్ బిల్లులు చెల్లించడానికి 2025 ఫిబ్రవరి 26న ఆమోదం తెలిపింది. ఆ మేరకు అదనపు బడ్జెట్ నిధుల నుంచి పెండింగ్ బిల్లులు చెల్లించడానికి అనుమతిస్తూ పాఠ శాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

12న వైవీయూ వ్యవస్థాపక కళాశాల దినోత్సవం

కడప ఎడ్యుకేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం వ్యవస్థాపక కళాశాల దినోత్సవం ఈనెల 12వ తేదీ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి వెల్లడించారు. నిర్వహణ ఏర్పాట్లు, పీజీ 2,4 సెమిస్టర్ల పరీక్షల తేదీల నిర్ణయం, సిలబస్ తదితర విషయాలపై ఆయా విభాగాధిపతులతో శుక్రవారం భేటి అయ్యారు.

పుస్తకాల భారం తగ్గించేలా నిర్ణయం తీసుకోడం హర్షణీయం

కడప ఎడ్యుకేషన్,మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పుస్తకాల భారం తగ్గించేలా సెమిస్టర్‌ల వారీగా పుస్తకాలు బైండింగ్ చేసి ఇస్తామని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి శుక్రవారం ఒక ప్రకట నలో పేర్కొన్నారు. విద్యార్థులకు పుస్తకాల భరాం వల్ల తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని.. ఈ భారాన్ని తగ్గించాలంటూ తాము ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పుస్తకా లను సెమిస్టర్ల వారీగా బైండింగ్ చేయించి పంపిణీ చేయించడంతో పాటు నాణ్యమైన విద్యాకానుక కిట్లను అందిస్తామని ప్రకటించడం స్వాగతించదగ్గ విషయమన్నారు. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని పదివేల పాఠశాలల్లో అమలు చేస్తున్నట్లు మంత్రి చెప్పారని, అయితే ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తగ్గిస్తే ఇది సఫలీకృతం అవుతుందన్నారు.

మహిళ హత్యకేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు చేసిన నిందితుడిని చూపుతున్న సీఐ, ఎస్ఐలు

పెండ్లిమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనపల్లె గ్రామంలో ఈనెల 2వ తేదీ నాగులుగారి లూర్దు మేరి (50) అనే మహిళ హత్యకు గురైం ది. మృతురాలి కూతురు నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ మధు సూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మేరీని ఆమె భర్త సుబ్బరాయుడు తలను గోడకు కొట్టడంతో మృతి చెందినట్లు విచారణలో తేలింది. నిందితుడు రెవెన్యూ అధికారుల ద్వారా పోలీసుస్టేషన్‌కు వచ్చి తన నేరాన్ని అంగీకరించడంతో అరెస్టు చేసి కోర్టులో హాజరు పెట్టినట్లు సీఐ చల్లని దొర, ఎస్ఐ మధుసూదన్ రెడ్డిలు తెలిపారు.

అంగన్వాడీ టీచర్ ఆత్మహత్యాయత్నం

- సీడీపీవో వేధింపులే కారణమంటూ వివరణ

కాశినాయన మార్చి 7 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కోడిగుడ్లపాడు అంగన్వాడీ టీచర్ గురుదేవి శక్రవారం విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆమెను పోరుమామిళ్ల ప్రభుత్వ వైద్య శాలకు తరలించి చికిత్స అందించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. పోరుమామిళ్ల ఐసీడీఎస్ సీడీపీవో వేధింపులే తన ఆత్మహత్యాయత్నానికి కారణమని బాధితురాలు గురుదేవి మీడియా ఎదుట వాపోయారు.

వేధింపులకు పాల్పడలేదు.. సీడీపీఓ

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తాను లంచం డిమాండ్ చేసి వేధింపులకు పాల్పడటం వల్లనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు అంగన్వాడీ కార్యకర్త చేస్తున్న ఆరోపణలు సరికాదని పోరుమామిళ్ల సీడీపీఓ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్వాడీ సెంటర్ కోడ్ మార్పు విషయంలో కార్యకర్త తనను సంప్రదించారని.. ఆ కోడ్ మార్చే అంశం తన పరిధిలోకి రాదని చెప్పానన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పినప్పటికీ కార్యకర్తతో పాటు ఆమె కుమార్తె బెదరింపులకు పాల్పడ్డారన్నారు. తన తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుందని ముందుగానే హెచ్చరించినట్లు ఆమె వివరించారు. ఇదే అంశాన్ని ఒక రోజు ముందుగానే పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లానని తెలిపారు.

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తికి రిమాండ్

వేంపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె ఫారెస్టు బీట్ కప్పలమడుగు వద్ద కొండ గొర్రె (వన్యప్రాణి)ను వేటాడిన చింతకాయల శ్రీరాములును అరెస్టు చేసి పులివెందుల కోర్టులో హాజరుపర్చినట్లు రేంజర్ బాలసుబ్రమణ్యం తెలిపారు. వేటా డేందుకు వెళ్లారని సమాచారం అందడంతో దాడి చేసి శ్రీరాము లును అదుపులోకి తీసుకొని నాటుతుపాకీని, 4 కేజీల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడికి చర్యలు



ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న సీఐలు యుగంధర్, రమణారెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో గంజాయి అక్రమ రవాణా కట్టడి చేసేందుకు పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో బాగంగా శుక్రవారం స్థానిక టూటౌన్ ఏరియాలో ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలను గొడౌన్‌లను డిస్ట్రిక్ నార్కోటిక్ కంట్రోల్ సెల్ (డీఎన్‌సీసీ) టూటౌన్ పోలీసులు సంయుక్తంగా తనిఖీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు ట్రాన్స్‌పోర్టులలో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడినా, సహకరించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని టూటౌన్ సీఐ యుగంధర్, డీఎన్‌సీసీ సీఐ రమణారెడ్డిలు ట్రాన్స్‌పోర్టు యజమానులను హెచ్చరించారు. పార్శిళ్లలో ఎక్కడైనా గంజాయి ఆనవాళ్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మల్లికార్జునరెడ్డి మృతదేహం

దువ్వూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు, క్రీస్తురాజపురం మార్గమధ్యంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తుమ్మల మల్లికార్జునరెడ్డి (39) అనే వ్యక్తి మృతి చెందాడు. దువ్వూరు నుంచి తన సొంత గ్రామం గుడిపాడుకు బైక్‌పై వెళుతూ అదుపు తప్పి కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు.

ఎస్ఎస్‌సీ విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్

- ఈవిద్యాసంవత్సరం నుంచి ప్రారంభం
- మార్చి 20, 25న పరీక్షలు

వల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షలంటే ప్రతి విద్యార్థికి భయం ఉంటుంది. కొంత మంది విద్యార్థులకు ఎక్కువసార్లు డ్రిల్లింగ్ చేయడం వల్ల మాత్రమే గుర్తుండే అవకాశం ఉంటుంది. మరి కొంతమంది విద్యార్థులు నేర్చుకునే విషయాన్ని పరీక్ష రూపంలో చూపించడంలో అనేక సమస్యలు ఎదుర్కొంటారు. ఇంకొందరు విద్యార్థులు ఎక్కువగా వీక్‌గా ఉన్న సబ్జెక్టుల్లో ప్రీఫైనల్, గ్రాండ్ టెస్టువంటి పరీక్షలు సాధన చేయడం ద్వారా మంచిమార్కులు సాధించేందుకు ఇదొక చక్కటి అవకాశం. పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అనేక అపోహలను పొగొట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సీ విద్యార్థులకు గ్రాండ్ టెస్టు నిర్వహిస్తుంది. జిల్లాలో 27,800 మంది విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం పరీక్షలు రాయనున్నారు. మార్చి 17 నుంచి 31 వరకు ఎస్ఎస్‌సీ పరీక్షలను నిర్వహిస్తారు.

రీసైక్లింగ్ పునశ్చరణ : డీఈవో

విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్న సందర్భంగా పదే పదే ప్రాక్టీసు పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో పున శ్చరణ పెరిగి రీసైక్లింగ్ అలవాటు పడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఈ గ్రాండ్ టెస్టు వల్ల పరీక్షల సమయంలో సమయాన్ని ఎలా ఉపయోగించు కోవాలో తెలుస్తుందన్నారు. ఏ ప్రశ్నకు ఏ జవాబు రాయాలనేది విద్యార్థులకు అవగాహన ఏర్పడుతుందన్నారు. పరీక్షలు రాసేటప్పుడు భయం తొలుగు తుందన్నారు. దీంతో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడంతో పాటు మార్కులు అత్యధికంగా తెచ్చుకునేందకు ప్రీఫైనల్, గ్రాండ్ టెస్టు వంటి పరీక్షలు ఎంతో ఉపయోగపడుతాయి.

గుండె పోటుతో ఉపాధి కూలి మృతి



వల్లూరు మార్చి 7, (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని అంబవరం గ్రామంలో శుక్రవారం ఉపాధి పనిచేస్తున్న మహిళా కూలీ చెంచుగారి పుల్లమ్మ గుండెపోటుతో మృతి చెందినట్లు ఏపీఓ సుధా రాణి తెలిపారు. ఉదయం ఉపాధి పనికి వెళ్లిన పుల్లమ్మ గుండెల్లో నొప్పి వస్తుందని చెప్పడంతో ఆమె బంధువులు ఇంటివద్దకు తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతదేహాన్ని ఏపీఓతో పాటు ఉపాధి సిబ్బంది సంద ర్శించి నివాళి అర్పించారు.

చాపకింద నీరులా...

- జోరుగా సాగుతున్న మట్కా దందా
- టెక్నాలజీని వాడుకుంటున్న బీటర్లు
- పోలీసులకు సవాల్‌గా మారిన వ్యవహారం

కడప క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రూ.వంద కడితే వెయ్యి రూపాయలు వస్తుందనే ఆశతో కొందరు... వెయ్యి కడితే లక్షల్లో వస్తుందంటూ మరికొందరు అత్యాశతో మట్కా ఊబిలో చిక్కుకొని జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఈ మట్కాలో పోయేదే కానీ వచ్చేది లేదనేది తెలియకపోవడంతో ఎక్కు వగా ఈ దందాలో పేద, మధ్యతరగతి వారే బలవుతున్నారు. వివరాల్లోకి వెళితే...

జిల్లా వ్యాప్తంగా మట్కా జూదం రోజురోజుకూ చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ మట్కా ఊబిలో పేద మధ్యతరగతి వారితో పాటు యువత, చిరుద్యోగులు చిక్కుకుపోతున్నారు. ఇక ఎక్కువగా కూలీ నాలీ పనులు చేసుకునే వారు రోజంతా సంపాదించిన డబ్బులు మట్కా జూదంలో పోగొట్టుకుంటున్నారు.

జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, మైదుకూరు, బద్వేలు, కమలాపురం నియోజకవర్గాల్లో మట్కా జోరుగా సాగుతున్నట్లు సమాచారం.



టెక్నాలజీని వాడుకుంటున్న బీటర్లు

ఒకప్పుడు మట్కా బీటర్లు ఎక్కడో ఒక ప్రదేశంలో ఉంటూ చిన్న చిన్న చీటీల ద్వారా ఈ జూదాన్ని నిర్వహించే వారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరు స్మార్ట్ ఫోను వినియో గిస్తున్నారు. ఇదే అదనుగా భావించిన మట్కా బీటర్లు టెక్నాలజీని ఉపయోగిస్తూ గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా నడుపుతున్నారు. దీంతో మట్కా నిర్వాహకులను పట్టుకోవాలంటే పోలీసులకు సవాల్‌గా మారింది. ఇక మట్కా బీటర్లు మట్కా వేసే వారికి ఇన్ స్టాగ్రామ్‌లో ఐడీలు పెట్టి అందులో మట్కా నెంబర్లు సేకరిస్తున్నారు. ఎవరైనా పట్టుబడితే తెలివిగా ఇన్‌స్టా గ్రామ్‌లోని ఐడీని తొలగిస్తున్నారు. దీంతో వీరిని గుర్తించడం సాధ్యపడటం లేదు.


కొరవడిన నిఘా

మట్కాదందాను నిర్మూలించడంలో పోలీసులు విఫలమవుతున్నారు. మట్కా బీటర్లు టెక్నాలజీని వాడుకోవడం, కొత్తకొత్త వ్యక్తులు మట్కా బీటర్లుగా అవతార మెత్తుతుండటంతో వీరిని గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. గతంలో మట్కా అంటే ఫలానా వ్యక్తులని గుర్తింపు ఉండడంతో వారిపై నిఘాఉంచి పట్టుకునేవారు. అయితే ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ల ద్వారా ఈ దందా నడుపుతుండడంతో పోలీసు నిఘా కొరవడినట్లు స్పష్టమవుతుంది. కాగా, కొన్ని చోట్ల బహి రంగంగానే దుకాణాల్లో మట్కా స్లిప్పులు రాస్తు న్నట్లు తెలుస్తుంది.

బతికుండగానే డెత్ సర్టిఫికెట్ సృష్టించి..

- స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు
- పోలీసులకు బాధిత మహిళ ఫిర్యాదు

మైదుకూరు రూరల్, మార్చి7 (ఆంధ్ర జ్యోతి): బతికుండగానే చనిపోయినట్లు దొంగసర్టిఫికెట్ సృష్టించి తన స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారంటూ మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. పోలీసుల సమాచారం మేరకు.. మైదుకూరు-నంద్యాల రోడ్డులో 1149, 1158 సర్వే నెంబర్లలో 10సెంట్ల స్థలాన్ని కడపకు చెందిన అహల్య, ఆమె కుమార్తె అమరావతి 1998 సంవత్సరంలో యెలిశెట్టి పిచ్చమ్మ, ఆమె కుమార్తెలు ఉషారాణి, సుబ్బరత్నమ్మ, గీతాకుమారిల వద్ద కొనుగోలు చేశారు. కాగా, అదే స్థలాన్ని యెలిశెట్టి పిచ్చమ్మ వారి కుమార్తెలు 2011లో చింతకుంట షబ్బీర్ హుసేన్‌కు అమ్మారు. అహల్యా, అమరావతిల మధ్య మనస్పర్ధలు ఉన్నాయని తెలుసుకున్న షబ్బీర్‌హుసేన్ అమరావతితో ఒప్పందం కుదుర్చుకొని అహల్య చనిపోయినట్లు డెత్ సరిఫికెట్ సృష్టించి, షబ్బీర్ హుసేన్ భార్య రహమ్మతున్నీషా పేరున 2022లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఆన్‌లైన్‌లో చెక్ చేసి అహల్య మైదుకూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



యాంత్రీకరణ పరికరాలు మంజూరు

చెన్నూరు మార్చి, 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీతో విడుదల చేసిందని ఏవో శ్రీదేవి తెలిపారు. మండలానికి 59 పని ముట్లు మంజూరయ్యాయని, అందులో బ్యాటరీ, పవర్, ట్రాక్టర్ స్ప్రేయర్స్ విత్తన గొర్రు, కల్టివేటర్, గుంటక బ్లేడ్, కేజీ వీల్స్, ఈనాడు గొర్రు, ఎంబీ ఫ్లౌవ్, రోటవేటర్, 36, 42బ్లేడ్ల పవర్‌వీడర్, బ్రష్ కట్టర్ వున్నాయన్నారు., వీటిని అవసరమైన రైతులు స్థానిక వ్యవసాయ అధికారిని కలిసి పొందవచ్చని తెలిపారు.

సవరణ

ఆంధ్రజ్యోతి దినపత్రిక నందు 7-3-2025వ తేదీన పులివెందుల పురపాలక సంఘం బహిరంగ వేలము ప్రకటనలో 2వ కాలములో నిలుపబడిన వాహనముల స్టాండు, మండల రెవెన్యూ అధికారి గారిచే జారీచేయబడిన సాల్వెన్సీ పత్రము / బ్యాంకు గ్యారంటీ రూ. 10,00,000/-కుగాను రూ. 15,00,000/-గా ప్రచురితమైనది. దీనిని రూ. 10,00,000/-గా చదువుకోగలరు.

కమీషనర్, పులివెందుల పురపాలక సంఘం

సాధిస్తాం.. శాసిస్తాం..

● మహిళా దినోత్సవంలో మహిళలు

కడప ఎర్రముక్కపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆది నుంచి ఎన్నో అవరోధాలు ఎదుర్కొని ఆత్మవిశ్వాసంతో అనుకున్నది సాధించామని, అధికారం చేపట్టి శాసించే స్థాయికి చేరుతామన్న నమ్మకముందని మహిళా దినోత్సవ సభలో వక్తలు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, జనవిజ్ఞాన వేదిక, పీఎంఎఫ్ సంస్థల ఉమ్మడి ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పద్మ హాజరై మాట్లాడుతూ సమాజం సజావుగా నడవాలంటే స్త్రీ, పురుషులు సమాన బాధ్యత తీసుకోవాలన్నారు. లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ మానవజాతి మనుగడ మహిళపైనే ఆధారపడి ఉందని, ఆమె త్యాగాలు వెలకట్టలేనివన్నారు.

'మహిళ చదివితే సమాజం బాగుంటుంది'

వల్లూరు మార్చి 7, (ఆంధ్రజ్యోతి): మహిళలు చదివితే సమాజం బాగుంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి, సర్పంచ్ కుళాయప్ప పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దిగువపల్లి సచివాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం ర్యాలీతో పాటు చిన్నచిన్న పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

సింహాద్రిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలన, సెల్ఫ్ డిఫెన్స్, పరీక్షల ముందు స్ట్రెస్ లేకుండా ఉండటం తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గురుదేవి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలను సత్కరిస్తున్న ఇంటాక్ ప్రతినిధులు

వేంపల్లెలో..

వేంపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందని డాక్టర్ రజిత, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చెరసాల ఆంజనేయులు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులను, డాక్టర్‌ను సత్కరించారు. ఆడపిల్లలు చదివితే స్వశక్తితో ముందుకు సాగుతారని తెలిపారు.

ఐద్వా ఆధ్వర్యంలో..

పోరుమామిళ్ళ మార్చి 7, (ఆంధ్రజ్యోతి): ఐద్వా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అన్ని రంగాలలో మహిళలు చైతన్యవంతులై రాణించాలన్నారు. ఈ సందర్భంగా జెండాను ఎగురవేశారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత : డీఎంహెచ్‌వో



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ నాగరాజు

కడప కలెక్టరేట్ మార్చి7(ఆంధ్రజ్యోతి) దోమల నియంత్రణ అందరి బాధ్యత అని, రాత్రిపూట దోమ తెరలు తప్పక వాడాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం నగరంలోని నాగరాజుపేటలో జరిగిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని వీధులు, కాలువలను పరిశీలించారు. కాలువ ల్లో చెత్త వేయడం వల్ల నీరు నిలబడి దోమలు పెరుగుతాయన్నారు. దోమకాటు వలన మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ గురించి ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ వరుణ్‌కు మార్, ఎపిడమాలజిస్ట్ ఖాజామోహిద్దీన్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ మలేరియా అధికారి నాగలక్ష్మిరెడ్డి, డిప్యూటి డెమో రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో ఒకరు డీబార్

కడప ఎడ్యుకేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షల్లో చూసిరాతలకు పాల్పడిన విద్యార్థి డీబార్ అయినట్లు ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు. శుక్రవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణిత, బాటనీ, సివిక్స్ పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 64 కేంద్రాల్లో 15061 మంది హాజరుకావాల్సి ఉండగా 14461 మంది హాజరయ్యారన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు పెన్నిధి : బీటెక్ రవి

పులివెందుల టౌన్ మార్చి 7, (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు పెన్నిధని నియోజక ఇన్‌చార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజక పరిధిలోని లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి సీఎం రిలీఫ్ నిధులు అందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా 14 మంది లబ్ధిదారులకు రూ.18,34,554 చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంగోలులో పీవోడబ్ల్యూ సంఘాల విలీన సభ

కడప(వినాయకనగర్), మార్చి7 (ఆంధ్రజ్యోతి): రెండు ప్రగతిశీల మహిళా సంఘాల విలీన సభను ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా నాయకురాళ్లు సుబ్బలక్షుమ్మ, భవాని, సుజాత, మీనాక్షి, మహేశ్వరి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని నబీకోటలో విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కోసం మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక పోరాట దినంగా జరపాలని డిమాండు చేశారు. మహిళలు సంఘటితంగా పోరాడుతున్నా లైంగిక వేధింపులు పెరుగుతూనే ఉన్నాయన్నారు.

ఆశాలకు పదోన్నతులు కల్పించాలి



కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఆశా కార్యకర్తలు

కడప మారుతీనగర్ మార్చి7, (ఆంధ్రజ్యోతి): ఏఎన్ఎం, జీఎన్ఎం పూర్తిచేసిన ఆశా కార్యకర్తలకు ఏఎన్ఎంగా పదోన్నతులు కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. వెంకటసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం మంగళగిరిలోని వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట ఏఎన్ఎం, జీఎన్ఎం పూర్తిచేసిన ఆశా కార్యకర్తలు, వివిధ జిల్లాల ప్రతి నిధులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాష్ట్ర కమిషనర్ పాండియన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు లోకేశ్వరి, రాణి, మల్లేశ్వరి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఏప్రిల్ వరకు నీరందించి రైతులను ఆదుకోవాలి

కడప కలెక్టరేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కేసీ కెనాల్‌కు ఏప్రిల్ వరకు నీరు ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని, రాజోలి జలాశయం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలనీ వైసీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కేసీ కెనాల్‌కు నీరు రాకపోవడంతో మిరప, మినుము, వరి, పెసర, పసుపు తదితర పైర్లు ఎండిపోతున్నాయని, కనీసం ఏప్రిల్ 15 వ తేదీ వరకు లేదా మార్చి చివరి వరకైనా కేసీ కెనాల్‌కు నీరిచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. పోతిరెడ్డి పాడు వద్ద నీటిని పెంచి రాజోలు వద్ద 600 క్యూసెక్కుల నీరు స్థిరీకరించి కేసీ కెనాల్ కింద పంటలను కాపాడాలన్నారు. కుందూ ద్వారా సోమశిల జలాశయానికి వెళ్లే నీటిని రాజోలు వద్ద ఆపి కేసీ కెనాల్ కింద ఉన్న చెరువులను నింపాలని, దీనివల్ల బోరుబావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని కోరారు.

ప్రకృతి వ్యవసాయ పొలాల సందర్శన

వేముల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గన్నగారిపల్లె, వేముల గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఉపయోగించి సాగుచేసిన పొలాలను డీపీఎం ఎస్వీ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. రైతులు పాటిస్తున్న పద్ధతులు, అనుభవాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మార్కెటింగ్ సదుపాయాలు కల్పించాలని రైతులు కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో పులివెందుల డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముందుజాగ్రత్తలతో దృష్టిలోపాలను అరికట్టవచ్చు

లింగాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముందు జాగ్రత్తలతో సరైన సమయంలో కంటికి వైద్య పరీక్షలు చేయించుకుంటే దృష్టిలోపాలను అరికట్టవచ్చునని జిల్లా బ్లైండ్ కంట్రోల్ సొసైటీ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. లింగాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం దృష్టిలోపాలున్న విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి సుభాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతినే చర్యలు తగదు

● వీహెచ్‌పీ అధ్యక్షుడు రామ్‌మహేశ్

కడప కల్చరల్ మార్చి 7, (ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతినే చర్యలు తగదని విశ్వహిందూ పరిషత్ ప్రాంతీయ ధర్మాచార్య సంపర్క్ బెస్తవేముల రామ్‌మహేష్, జిల్లా అర్చక పురోహిత సంపర్క్ విజయ్‌బట్టర్, జిల్లా సత్సంగ్ సంపర్క్ వారణాసి శ్రీధర్‌శర్మ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వీహెచ్‌పీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాయచోటి వీరభద్రస్వామి పార్వేటి ఉత్సవం జరిగే సమయంలో హిందువులపై అన్యమతస్థులు పథకం ప్రకారం దాడికి తెగబడడం బాధాకరమన్నారు. పోలీసులు సైతం ఏకపక్షంగా హిందువులపై కేసులు బనాయించడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు చెన్నక్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

నిరంతరం శ్రమిస్తే చిత్రకారుల జాబితాలో స్థానం

కడప ఎడ్యుకేషన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చిత్రకారుడిగా రాణించాలనే తపన అణువణువునా నింపుకొని నిత్యం శ్రమిస్తే ప్రపంచ చిత్రకారుల జాబితాలో స్థానం ఉంటుందని యోగివేమన విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొట్టమొదటి చిత్రకారుడు దామెర్ల రామారావు జయంతిని విశ్వవిద్యాలయ ఫైన్ ఆర్ట్స్ శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవు : పీడీ

వేంపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధుల్లో అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని డ్వామా పీడీ ఆదిశేషు అన్నారు. వేంపల్లె మండలంలో 2023-24కు సంబంధించి ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం విచారించింది. విచారణలో వెల్లడైన తప్పులను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఓపెన్ ఫోరంలో చర్చించారు. పలు పనులకు సంబంధించి రికవరీని నమోదు చేశారు. సంబంధీకుల నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారులు, ఉపాధి హామీ సబ్బంది పాల్గొన్నారు.



వేంపల్లెలో ఉపాధి హామీ ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న డ్వామా పీడీ

రేషన్ బియ్యం మాఫియాను అరికట్టాలి

● డీఎస్పీకి ప్రజాసంఘాల వినతి

కడప మారుతీనగర్, మార్చి (ఆంధ్రజ్యోతి): నగరంలో యథేచ్ఛగా సాగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా మాఫియాను అరికట్టాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు డీఎస్పీ వెంకటేశ్వరరావును ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి కె.మాతయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా ప్రతినిధి ఎం.అంకన్న, పీడీఎస్‌యూ నగర నాయకుడు మహేష్, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు చిన్నసుబ్బయ్య మాట్లాడారు. నగర పరిధిలో ఉన్న కొందరు వ్యక్తులు, వారి బినామీలు ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యాన్ని ప్రతి నెలా సేకరించి ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంగా పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. రేషన్ బియ్యాన్ని తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

సీకేదిన్నె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రైతులు మామిడి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానశాఖ అధికారి జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని ఇప్పెంటలో శుక్రవారం మామిడి, మిరప పంటలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిలో ఫ్రూట్ కవర్లు వాడటం ఎంతో లాభదాయకమన్నారు. అంతేకాక తామరపురుగు, తేనేమంచుపురుగు, పండు ఈగె నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కేవీకే శాస్త్రవేత్త మానస మాట్లాడుతూ మిరపలో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుని చీడపీడలను సమర్థవంతంగా నియంత్రించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఈశ్వర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

చెన్నూరు మార్చి 7, (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా ప్రశాంతతకు నిలయంగా వున్న చెన్నూరులో పనిగట్టుకుని ఎవరైనా గొడవలకు దిగితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం చెన్నూరుకు వచ్చిన ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. మట్కా, గ్యాంబ్లింగ్, ఇసుక, బియ్యం అక్రమ రవాణా లాంటి వాటి జోలికి వెళితే చట్టపరమైన చర్యలతో పాటు బైండోవర్ కేసులుంటాయన్నారు. ప్రస్తుతం చెన్నూరులో పోలీస్ నిఘా పెంచామన్నారు. జరగబోయే జాతర ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం స్టాక్ వివరాలను స్టేషన్‌లో తెలపాలి

కడప క్రైమ్ 7, (ఆంధ్రజ్యోతి): బెల్లం వ్యాపారులు తమ వద్ద వున్న స్టాక్ అమ్మకాల తాలూకు వివరాలను 15 రోజులకోమారు స్టేషన్‌లో తెలపాలని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సహాయ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. నాటుసారా నిర్మూలనలో భాగంగా నవోదయం 2.0 పథకం అమలుపై శుక్రవారం బెల్లం వ్యాపారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా కాచే వారికి బెల్లం అమ్మరాదని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ వార్షికోత్సవం

కడప కల్చరల్ మార్చి 7, (ఆంధ్రజ్యోతి): నగరంలోని అమ్మవారిశాలలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం పునఃప్రతిష్ఠించి 12 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఈనెల 9వ తేదీన ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త చింతకుంట పుల్లయ్య వెల్లడించారు. శుక్రవారం స్థానిక ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని 102 గోత్రీకులు, భక్తాదులు తప్పక హాజరై పూజాకార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు. అలాగే సాయంత్రం అమ్మవారి తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల హుండీల లెక్కింపు

కడప కల్చరల్ మార్చి 7, (ఆంధ్రజ్యోతి): నగరంలోని మోచంపేటలో వెలసిన ప్రసన్న విశ్వేశ్వరస్వామి దేవాలయంతో పాటు దేవునికడపలోని సోమసుందరేశ్వరస్వామి ఆలయాల హుండీల లెక్కింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత ఆలయాల ఈవో శ్రీధర్‌తో పాటు దేవదాయశాఖ సూపరింటెండెంట్ రమణమ్మ పర్యవేక్షించారు. గత నవంబర్ 28నుండి ఈనెల 7 వరకూ మోచంపేట విశ్వేశ్వరస్వామి ఆలయానికి రూ:19579, అలాగే సోమసుందరేశ్వరస్వామి ఆలయానికి రూ.63,945 ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురళీజగన్నాథ్, భక్తులు పాల్గొన్నారు.

రసాయన ప్రమాదాలపై అవగాహన ఉండాలి

సీకేదిన్నె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలు రసాయన ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని కడప నగర కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బలిజపల్లె సమీపంలో హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ శుక్రవారం అత్యవసర కెమికల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమిషనర్ మాట్లాడారు. జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా రసాయన ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా తప్పించుకోవాలని, ప్రమాదాలను నివారించాలన్న అనే అంశాలపై వివరించారు. అనంతరం ప్రమాదాల నివారణపై హిందుస్థాన్ పెట్రోలియం అధికారులు ప్రజలకు విన్యాసాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ క్రిష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సుధకుర్బా, ఏపీఎస్పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎన్‌హెచ్‌ఎస్‌నాయక్, వీఆర్వో రవికుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఓబయ్య, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

జ్యోతిరెడ్డిని పరామర్శించిన తులసిరెడ్డి

పులివెందుల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దేవిరెడ్డి జ్యోతిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఇటీవల బెంగుళూరులో మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకొని పులివెందులలోని స్వగృహానికి వచ్చిన జ్యోతిరెడ్డి, ఆమె భర్త డాక్టర్ సదాశివారెడ్డిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట భాస్కర్‌రెడ్డి, తిరుపాల్‌రెడ్డి, నాగరాజు, వెంకటేశ్, అమర్, ఉత్తన్నరాజు, ఐచర్ రమణ ఉన్నారు.

ఇంటిపన్ను వంద శాతం వసూలు చేయాలి

చెన్నూరు మార్చి 7, (ఆంధ్రజ్యోతి): ఇంటి పన్నును వంద శాతం వసూలు చేయాలని ఈవోపీఆర్‌డీ సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులుతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు జట్లుగా ఏర్పడి వసూలు చేయాలని, ఆలస్యం లేకుండా మార్చి చివరి నాటికి పూర్తి చేయాలన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన వారికి చేయూత

సింహాద్రిపురం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) మండలంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించినవారికి చేయూతనిస్తామని వైజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రనాగు శ్రీధర్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించినవారికి వరుసగా రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేల నగదు ప్రోత్సాహంతో పాటు మెమోంటోను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే డిగ్రీ, డిప్లొమో, ఇంజనీరింగ్ చదువుతున్న గ్రామీణ పేద విద్యార్థులను గుర్తించి వారికి ఏడాదికి రూ.10వేలు అందిస్తామన్నారు. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు.

ఆధ్యాత్మిక జీవితమే పరలోకానికి మార్గం

కడప కల్చరల్ మార్చి 7, (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక జీవనమే పరలోకానికి మార్గమని దైవజనులు కె.కె.సుధీర్ అన్నారు. శుక్రవారం స్థానిక కృపాకాలనీలో సిస్టర్ శాంతమ్మ, పాస్టర్ పి.మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధ్యాత్మిక సదస్సు నిర్వహించారు. యువత చెడుమార్గంలో కాకుండా సన్మార్గంలో నడవాలని కోరారు. ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఐక్యతతో జీవించాలని సూచించారు. కార్యక్రమంలో సేవకులు సుభాష్‌చంద్రబోస్, కిరణ్, రజనీకాంత్, రవితేజ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీని తనిఖీ చేసిన ఆర్డీవో



చాపాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో మొబైల్ వాహనం ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీలర్ గ్రామస్థులకు బియ్యం తూకం వేస్తున్న విషయాన్ని ఆమె పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. బియ్యం నాణ్యతను కూడా పరిశీలించారు. తహసీల్దారు రమాకుమారిని అడిగి గ్రామంలో పరిస్థితిని ఆమె తెలుసుకున్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాయచోటిలో వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ నాయకుడు నాగమునిరెడ్డి, బీజేపీ పట్టణాధ్యక్షుడు వంకధార నరేంద్రరావులు పేర్కొన్నారు. దేవుని ఊరేగింపులో పాల్గొన్న మహిళలు, చిన్నపిల్లలపై కూడా దాడి చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రమేష్, మురళి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి



ప్రొద్దుటూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కొండాపురంలో కేక్ కట్ చేస్తున్న మహిళా ఉద్యోగులు

చాపాడు/కొండాపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని ఐసీడీఎస్ సీడీపీవో సావిత్రమ్మ, వెలుగు ఏపీఎం శ్రీధర్ అన్నారు. జాతీయమహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెలుగు కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మహిళలు చదువుకుంటే ఇంటిలో వెలుగులు విరాజిల్లుతాయన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు అధికారులు బహుమతులు పంపిణీ చేశారు. కాగా కొండాపురం ఎస్టీ కాలనీలోని అంగనవాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, పలువురు ఉద్యోగులను సన్మానించారు. అదే విధంగా మహిళా ఉద్యోగులకు ఆటలపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు డేరా జ్యోతి, పద్మావతి, తులసి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని డీఎస్పీ పి.భావన పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం జిల్లా పోలీసు శాఖ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్వీ డిగ్రీ కళాశాల, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో గీతాశ్రమం నుంచి పుట్టపర్తి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మిదేవి, ఎస్వీ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, దావీదు, మౌనయ్య, హేమలత, విమల, పాల్గొన్నారు. పురుషులతో సమానంగా మహిళలు సమానత్వం సాధించినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌లు పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పురోగమిస్తున్నా ఇప్పటికి వారిపై అత్యాచారాలు, వేదింపులు, అధికమవుతుండడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలసుబ్బయ్య, రాఘవ, ఐద్వా పట్టణ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, సర్వేశ్వరి, రాములమ్మ, లక్ష్మీదేవి, నాగలక్ష్మి, జయమ్మ, కళావతి, దుర్గ, పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్‌లో: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా మండల పరిధిలోని స్కాలర్ పబ్లిక్ స్కూల్‌లో ఐసీ డీఎస్ చౌడూరు సెక్టార్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో బాలికలకు 2కేరన్ పోటీలను నిర్వహించారు. పాఠశాల కర స్పాండెంట్ బాల సుబ్బారెడ్డి, హెచ్‌ఎం రాజేంద్ర, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో మహిళలకు ప్రాధాన్యం

● మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషన్‌రెడ్డి



మహిళకు సన్మానం చేస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తామని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురష్కరించుకుని ఎస్.ఉప్పలపాడు గ్రామానికి చెందిన మహిళా రైతు కుళాయమ్మను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, మార్కెట్‌యార్డు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రతి ఒక్కరు మహిళలను గౌరవించాలని అర్బన్ సీఐ లింగప్ప సూచించారు. శుక్రవారం పాత బస్టాండులో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా మహిళా విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి, అధ్యాపకులు, స్థానికులు, మహిళా విద్యార్థినులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేవంటూ నిర్మాణాలు కూల్చివేత



తలనీలాల భవనాలను కూల్చివేస్తున్న అటవీ అధికారులు

కాశినాయన మార్చి2(ఆంధ్రజ్యోతి): జ్యోతీక్షేత్రంలో కేంద్ర అటవీశాఖ అనుమతులు లేకుండా భవనాలు నిర్మించారంటూ శుక్రవారం ఉన్నతాధికారుల ఆదేశాలతో అటవీ శాఖ అధికారులు కూల్చివేశారు. పోరుమామిళ్ల ఫారెస్ట్ రేంజి ఆఫీసర్ రఘునాథరెడ్డి తన సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేశారు. కాగా మఠం సమీపంలోని అచలానంద పీఠాధిపతి నీరజానందస్వామి ఇతర భక్తులు నిర్మాణాలు కూల్చవద్దంటూ కొంత సమయం ఇవ్వాలని అధికా రులను వేడుకున్నప్పటికి ఫలితం లేకుండా పోయింది. పోరుమామిళ్ల సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తుమధ్య కళ్యాణకట్ట, సమీపంలోని ఇతర భవనాల కూల్చివేత కార్యక్రమం కొనసాగించారు. కాశినాయన జ్యోతిక్షేత్రంలో ఇప్పటికే రెండు సార్లు భవనాలు కూల్చారని ఇది మూడవసారి అని భక్తులు,పలువురు పీఠా ధిపతులు విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు మేల్గొని ఇలాంటి కూల్చివేతలు జరగకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. నర్సాపురం ఏఎస్‌ఐ రమణ, పోలీసులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు తరలి రండి

జమ్మలమడుగు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న జరిగే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు జమ్మలమడుగు నియోజకవర్గం నుంచి జనసేన సైనికులు తరలిరావాలని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ నల్లంశెట్టి నాగార్జున పిలుపునిచ్చారు. శుక్రవారం జమ్మలమడుగులోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2014 మార్చి 14వ తేదీన ఏర్పడిన జనసేన పార్టీ నాటి నుంచి 2024 వరకు ఎన్నో విధాలుగా ప్రజల పక్షాన సమస్యలపై పోరాటం చేస్తూ వచ్చిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రాష్ట్రంలోని ప్రజలతో ప్రతి సమస్యపై పరిష్కరించే దిశగా జనసేన ముందుకు వెళుతున్నారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జనసేన పార్టీ జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దారు

మైలవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):గ్రామ రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దారు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిదిలోని రామచంద్రాయపల్లె పంచాయతీలో పర్యటించిన తహసీల్దారు గ్రామంలో రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా ఏవైనా సమస్యలు వస్తే దరఖాస్తు ఇచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ సభ వాయిదా వేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

మైలవరం, మార్చి 7 (ఆంధ్ర జ్యోతి): దాల్మియా పరిశ్రమ రెండో ప్లాంట్‌కు ఈనెల 27వ తేదీన నిర్వహించే ప్రజాభి ప్రాయ సేకరణ సభను వా యిదా వేసుకోవాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గ్రామ రైతుల, ప్రజల సమస్యలు పరిష్కరించాకే సభను ఏర్పాటు చేయాలని అలా కాకుండా దాల్మియా ఒత్తిడికి తలొగ్గి, రైతుల సమస్యలు పట్టించుకోకుండా చేస్తే చాలా తీవ్రమైన పరిస్థితులుంటాయని దీనికి బాధ్యత జిల్లా యం త్రాంగానిదేనన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దుగనపల్లి గ్రామం లో పొలంలోనే పురుగుల మందుతాగి మృతి చెందిన రైతు మోషే అంత్యక్రియల్లో పీఆర్ పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడు తూ దుగనపల్లి, నవాబుపేట, చిన్నకొమెర్ల గ్రామాల రైతులు దాల్మియా పరిశ్రమ నుంచి వచ్చే దుమ్ము దూళితో అలాగే బ్లాస్టింగ్ వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దుగనపల్లి గ్రామ ప్రజలకు పునరా వాసం కల్పించాలని అలాగే భూములను దాల్మియా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పి.గిరిధర్‌రెడ్డి, కోమె ర్ల మోహన్‌రెడ్డి, ధన్నవాడ మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోపై విచారణకు నోటీసులు జారీ

దువ్వూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు వీఆర్వోగా పనిచేసి ప్రొద్దుటూరుకు బదిలీపై వెళ్లి విధులు నిర్వహిస్తున్న రమణారెడ్డికి మండల తహసీల్దారు అక్బల్‌బాష నోటీసులు జారీ చేశారు. రైతుల వద్ద డబ్బులు తీసుకోకున్నట్లు ఆయనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నోటీసులు పంపామన్నారు. రైతులతోపాటు వీఆర్వోకు విచారణ నిమిత్తం నోటీసులు ఇచ్చినట్లు తహసీల్దారు చెప్పారు.

ఉపాధి పనులు ప్రారంభం

జమ్మలమడుగు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభమయ్యాయని, మండల అధికారిణి పద్మారాణి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు కూలీలకు పనులు ఉంటాయన్నారు. కూలీలకు కొలతలను బట్టి రూ.250 నుంచి రూ.270 వరకు కూలి డబ్బులు అకౌంట్లలో జమ అవుతాయన్నారు. ప్రస్తుతం 2025 జనవరి 13 వరకు కూలీలకు డబ్బులు పడ్డాయని, అప్పటి నుంచి ఇప్పటి వరకు కూలీలకు డబ్బులు ఖాతాలో జమ కాలేదన్నారు.

ఏళ్లతరబడి బియ్యం వ్యాపారం చేస్తున్నాం

మైదుకూరు రూరల్ ,మార్చి7(ఆంధ్రజ్యోతి) : గత 25 ఏళ్లగా బియ్యం వ్యాపారం చేస్తున్నాము, మాది అక్రమ వ్యాపారం కాదని .జిల్లా రైస్ అసోయేషన్ ట్రెజరర్ సూరిశెట్టి ప్రసాద్ విలేకరుల సమావేశంలో తెలిపారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వేలం ద్వారా కొన్న బియ్యం మాత్రమే పాలిష్ పట్టించి అమ్ముతున్నానని తెలిపారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం నుంచి సుమారు 7వేల ఆరు వందల క్వీటాల బియ్యం కోనుగోలు చేశానని తెలిపారు. ఈ విషయం చాలా మంది నాపై ఫిర్యాధు చేస్తున్నారని ఆయన తెలిపారు.

కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి

ఎర్రగుంట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అసంఘటిక కార్మికుల భద్రత కోసం నూతనంగా ప్రవేశపెట్టిన ఈశ్రమ్‌లో కార్మికులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కమలాపురం లేబర్ ఆఫీసర్ ఏవీ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఎర్రగుంట్లలో ఆయన భవన నిర్మాణ కార్మికులకు కొందరికి కార్డులను పంపిణీచే చేశారు. పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 12వరకు అమలులో ఉంటుందన్నారు. డీగ్రీ, ఇంటర్, పది చదివిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బద్వేల్ పెద్దచెరువుకు నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న చైర్మన్ ఈఈ తదితరులు

బీ.కోడూరు మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లోయర్‌సగిలేరు ప్రాజెక్ట్ నుంచి శుక్రవారం బద్వేల్ పెద్ద చెరువుకు నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్ట్ ఛైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, తెలుగంగ ఈఈ శేషబాబు తెలిపారు. బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి వేసవిని దృష్టిలో పెట్టుకొని బద్వేల్ పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అర టీఎంసీ నీటి విడుదలకు అనుమతి ఇప్పించాడన్నారు. ఈనీటిని ప్రజలు తాగునీటి అవసరాలకే వినియోగించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకుడు బొజ్జ రోశన్న, డీఈ వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి,టీడీపీ నాయకులు రమణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చిన్నారి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సరైన వైద్యం అందించకుండా తమ చిన్నారి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు మధుసూదన్‌రెడ్డి, భావనలు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాన్పుకోసం ఓ ప్రవేటు ఆస్పత్రిలో చేరగా అక్కడ డెలివరి కాగానే బాబు ఏడ్వడంలేదని మరో ఆస్పత్రికి తీసుకెళ్లారన్నారు. అయిదు నిమిషాల తర్వాత 30 శాతం మాత్రమే బతికే అవకాశం ఉందని తెలుపడంతో కర్నూలు, హైదరాబాదుకు వెళతామని చెబితే అక్కడ చికిత్స తామే ఇస్తామని వైద్యులు భరోసా ఇచ్చారన్నారు. వైద్యుల నిర్లక్ష్యం వలన తమ బాబు మృతిచెందారని తెలిపారు. ఆస్పత్రులపై కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎర్రగుంట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లలో మరమ్మతు పనులు చేస్తున్న కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం వరకు 1గంట విద్యుత్ సరఫరా ఉండదన్నారు ముద్దనూరు రోడ్డు, కడపరోడ్డు, వేంపల్లి రోడ్డు, రాణీవనం, వినాయకనగర్, సుందరయ్యనగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఎస్టేట్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఆ మేరకు వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ కోరారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్ట్ ..34దుంగలు, బైకులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఎర్రదుంగలు

బద్వేల్ రూరల్ మార్చి2(ఆంధ్రజ్యోతి): బద్వేల్ అటవీప్రాంత పరిధిలోని శ్రీరామాపురం సమీపంలో ఎద్దులబోడు వద్ద శుక్రవారం ముగ్గురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారినుంచి రెండు మోటర్ బైకులు 34 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు కార్యాచరణలో భాగంగా ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ బాలిరెడ్డి ఆదేశాలమేరకు ఆర్ఎస్ఐ నరేష్ చేపట్టిన కూంబింగ్‌లో భాగంగా ఎద్దుల బోడువద్ద రెండు మోటారు సైకిళ్లపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు టాస్క్‌ఫోర్స్ వారిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారని వారు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా రవాణాకు సిద్ధంగా ఉంచిన 34 దుంగలు దొరికాయని వాటివిలువ రూ.32 లక్షల వరకు ఉంటుందన్నారు. కేసును ఎస్ఐ రఫీ నమోదు చేసుకొని విచారిస్తున్నాడన్నారు.

విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి



విద్యార్థికి పరీక్ష సామగ్రి అందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి):పదో తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని వాసవీ క్లబ్ సిరిపురం అధ్యక్షుడు గుండా పద్మనాభయ్య, ఎస్‌బీఐ రిటైర్డు మేనేజర్ ఎం.రాజేశ్వరరాలు పేర్కొన్నారు. శుక్రవారం డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూలులో 10వ తరగతి విద్యార్థులకు వాసవీ క్లబ్ సిరిపురం ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రిని ఉచితంగా అందజేశారు. విద్యార్థులు ఉన్నత స్థానానికి చేరుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీనరసమ్మ, వేణుగోపాల్, అశోక్‌కుమార్, సురేష్‌బాబు, నరసింహరావు, సుబ్బారావు, వరలక్ష్మి, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు మోడల్‌స్కూల్స్ ఏర్పాటు



మాట్లాడుతున్న ఎంఈవో శోభారాణి

ప్రొద్దుటూరు టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయనున్నట్లు ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణిలు తెలిపారు. మోడల్‌స్కూల్స్ ఏర్పాటుపై శుక్రవారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1, 2 తరగతులతో ఫౌండేషన్ స్కూల్స్ 1 నుంచి 5వ తరగతి వరకు 40 కన్నా తక్కువ మంది విద్యార్థులు ఉంటే ఆ పాఠశాలలను బేసిక్ పాఠశాలలుగా మార్పు చేస్తారన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు 50కిపైగా విద్యార్థులున్న పాఠశాలలను మోడల్స్ స్కూల్స్‌గా, 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 1 నుంచి 5 కి.మీ. పరిధిలో ఉన్న పాఠశాలలను విలీనం చేసి విద్యార్థుల ట్రాన్స్‌పోర్టు అలవెన్స్‌ను నెలకు రూ.600 ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ప్రతి పంచాయతీకి, వార్డుకు ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మోడల్స్ స్కూల్స్ ఏర్పాటుపై పేరెంట్స్ కమిటీ, తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకుని ప్రభుత్వానికి సమర్పించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.